క్లుప్తంగా

రైస్ మిల్లు లీజు వేలం.. రూ.3 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న నాయకులు

పాపన్నపేట(మెదక్): కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం రైస్ మిల్లును ఏడాది కాలం పాటు లీజు ఇచ్చేందుకు గురువారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రైలు మిల్లు రూ.3 లక్షలకు ఖరారైనట్లు చైర్మన్ త్యార్ల రమేష్ తెలిపారు. ఈ మేరకు అన్నారానికి చెందిన అశోక్ లీజు హక్కు పొందారని వివరించారు. కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాపోటీలకు సదాశివపల్లి విద్యార్థిని



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుడు

కౌడిపల్లి(నర్సాపూర్): అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని సదాశివపల్లికి చెందిన విద్యార్థిని ఎంపికైంది. నర్సాపూర్‌లోని ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వందన ఇంటర్ స్కూల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ 2025కు ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. స్వామి వివేకానంద స్కూల్ ఆఫ్ యోగా రంగారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ యోగా అండర్14 పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఈనెల 26న సంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో జరిగే రాష్ట్రస్థాయి యోగాపోటీల్లో పాల్గొననుంది.

యూనిఫాం అందజేత



యూనిఫాం అందజేస్తున్న మహేష్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పబ్బ మహేష్‌గుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 114 మంది విద్యార్థులకు సొంత నిధులు రూ.లక్షతో యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కళాశాలలో నెలకొన్న పలు సమస్యలపై ప్రిన్సిపాల్ శైలజ విన్నపించడంతో 15 రోజుల్లో కంప్యూటర్, బెంచీలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రమణగౌడ్, మన్సూర్, యాదగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాగేశ్వర్‌రావు, రాములుగౌడ్, లక్ష్మీనర్సయ్య, దుర్గేష్, అశోక్, నాగారాజు, సంతోష్, తదితరులు ఉన్నారు.

రోడ్డుపైనే నిలిచిన బస్సు



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మెదక్ నుంచి వెల్దుర్తి వస్తున్న ఆర్టీసీ బస్సు రామాయిపల్లి గ్రామ శివారులో మొరాయించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు ఆందోళనలు చేపట్టినా అధికారులు పట్టించుకోకపోవడంతో బస్సు మార్గమధ్యలో నిలిచిపోయిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బస్సు ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మండల అధ్యక్షుడు గౌరి, నరెందర్ పాల్గొన్నారు.

పంతులమ్మపై చర్యలు తీసుకోవాలి: జైపాల్‌నాయక్



రేగోడ్(మెదక్): మండలంలోని రంజానాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులకు హాజరుకాని ఉపాధ్యాయురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'విధులకు మళ్లీ దుమ్మా' కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు నిత్యం హాజరై విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన టీచర్ రాకపోవడంతో బడికి తాళం పడుతోందన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బడికి దుమ్మా కొడుతున్న టీచర్‌పై, ఆమెకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

బోగస్ హాజరుకు చెక్

ఉపాధి జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం

- పని ప్రదేశాల్లో కూలీలకు ఐరిష్ నమోదు
- ఈకేవైసీ పూర్తికి ఆదేశాలు



హెచ్‌ఎంపల్లిలో ఈకేవైసీ చేస్తున్న టీఏ

టేక్మాల్(మెదక్): గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీల బోగస్ హాజరుకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ మస్టర్ పర్యవేక్షణ వ్యవస్థ (ఎన్‌ఎంఎస్‌ఎస్) యాప్‌లో కూలీల వివరాలు, ఈ–కేవైసీ నమోదు చేయడం తప్పనిసరి చేసింది. ఈ విధానంలో కూలీల జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయడం, వారి ఐరిష్ నమోదుతో ఒకరికి బదులుగా మరొకరు పనికి వచ్చే అవకాశం ఉండదు. అలాగే మృతుల పేర్లు నమోదు చేసే వీలుండదు. దీంతో అధిక మంది కూలీలు పనికి వచ్చినట్లు ఇష్టారాజ్యంగా మస్టర్లు రాయడానికి వీలు ఉండదు. ఇందులో భాగంగా టేక్మాల్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో ఈ–కేవైసీ పనులు కొనసాగుతున్నాయి.

15 రోజులు గడుస్తున్నా..

మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో జాబ్ కార్డులు 9,900, యాక్టివ్ జాబ్ కార్డులు 6,500 ఉన్నాయి. అలాగే మొత్తం 11,135 మంది ఉపాధి కూలీలు ఉండగా.. ఇప్పటివరకు 57శాతం మందికి ఈ–కేవైసీ పూర్తయింది. ఈ–కేవైసీ ప్రక్రియ ప్రారంభమై దాదాపు 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు మండలంలో 57శాతం వివరాల నమోదు పూర్తయ్యాయి. సిగ్నల్స్‌లో అంతరాయం కారణంగా ఈ–కేవైసీ నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని రోజుల క్రితం యాప్ సైతం మొరాయించడంతో ఇబ్బందులు తలెత్తాయి.

వారంలో పూర్తి చేయాలి



మండలంలో ఉపాధి హామీ కూలీల ఈ–కేవైసీ ప్రక్రియ వారంలోగా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయిలో టీఏలు, ఎఫ్‌ఎల ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. పని అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పిస్తాం. నకిలీ మస్టర్లకు తావు లేకుండా అర్హులైన కూలీలకు వంద రోజులు పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

పోలు, ఏపీఓ, టేక్మాల్

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



నార్సింగి: సంకాపూర్‌తండాలో పశువులకు వ్యాక్సినేషన్ చేస్తున్న డాక్టర్ సుధాకర్



చిట్కుల్‌లో గాలికుంటు టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినోద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ సర్జన్ డాక్టర్ వినోద్ అన్నారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి మండల పరిధిలోని చిట్కుల్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది గట్టయ్య, శంకర్, సతీష్, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పాపన్నపేట(మెదక్): గాలి కుంటు వ్యాధి రాకుండా పశువులకు టీకాలు వేయించాలని వెటర్నరీ ఏడీ పవన్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో 346 పశువులకు టీకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సౌమ్య, జేవీఓ సతీష్ కుమార్, సురేష్, సమీర్, సిబ్బంది, యాదయ్య, సాయిలు, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంకాపూర్‌తండాలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని సంకాపూర్‌తండాలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సుధాకర్, సిబ్బంది స్వామి, ఫజల్, నరేష్ పాల్గొన్నారు. ఈ నెల 17న సంకాపూర్, 19న జప్తిశివనూర్, 23న కాస్లాపూర్, 25న బీమ్రావుపల్లి, 26న నర్సంపల్లి, 31న వల్లభాపూర్, నవంబర్ 3న శేరిపల్లి, 5న నార్సింగిలో వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆకుకూరల్లో పోషకాలు అధికం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆకుకూరల్లో పోషకాలు అధికంగా ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికంగా లభించే 37 రకాల ఆకుకూరలు, చిరుధాన్యాలను వివరించారు. అలాగే ఆకుకూరలతో తయారు చేసిన ఆహార పదార్థాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే విద్యార్థులకు సమతుల్య ఆహారం, ఎనిమియా చాలెంజ్‌లపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ మేరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విఠల్, ఆర్‌ఐ సునీల్‌సింగ్, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సంజీవ

కౌడిపల్లి(నర్సాపూర్): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు మాలమహానాడు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు సంజీవ తెలిపారు. గురువారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మోసం చేసినట్లు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు శివ, ఎంఆర్‌పీఎస్ నాయకుల మన్నె భిక్షపతి, జాజితండా మాజీ సర్పంచ్ రమేష్, నాయకులు సత్యనారాయణగౌడ్, చంద్రునాయక్, రాము, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

బంద్‌కు సంపూర్ణ మద్దతు

మెదక్‌జోన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌తో ఈనెల 18 న నిర్వహించే రాష్ట్ర బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

18న బంద్‌కు సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఈనెల 18 శనివారం చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు ప్రజలందరూ సహకరించాలని సీపీఐ జిల్లా నాయకుడు సంగమేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కావున ప్రజలందరూ స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా డైరెక్టర్ డాక్టర్ జ్ఞానేశ్వర్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు, వైద్య సిబ్బంది

తూప్రాన్: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా డైరెక్టర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోలీసు, మున్సిపల్ అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం చాలా ముఖ్యమన్నారు. నాణ్యమైన ఆహారంతో పాటు వ్యాయామం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. చాలా మంది సీపీఆర్‌పై అవగాహన లేక నిర్లక్ష్యం చేయడం ద్వారా ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనిల్, సీహెచ్‌ఓలు బాల నర్సయ్య, లక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జ్యోత్స్నదేవి, సమత పాల్గొన్నారు.

ఆర్‌టీఐ చట్టంపై అవగాహన

ఎంపీడీఓ రియాజొద్దీన్



మాట్లాడుతున్న ఎంపీడీఓ రియాజొద్దీన్

టేక్మాల్(మెదక్): ప్రతి ఒక్కరూ ఆర్‌టీఐ చట్టంపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ రియాజొద్దీన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తూ ప్రతి ఒక్కరు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ 5నుంచి 15వ తేది వరకు ఆర్‌టీఐ వారోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఐటీఐ ద్వారా సమాచారం అందించిన సిబ్బందిని శాలువాతో సన్మానించారు. ఇందిరమ్మ హౌసింగ్ ఏఈ కౌశిక్, ఏపీఓ పోలు, ఈఓ రాకేష్ పాల్గొన్నారు.

అధికారుల ఆరా

రేగోడ్(మెదక్): మండలంలోని రంజానాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంతులమ్మ దుమ్మా కొడుతోందని.. బడి తెరుచుకోవడం లేదంటూ గురువారం సాక్షిలో 'విధులకు మళ్లీ దుమ్మా' కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఇంటిలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. పూర్తి సమాచారం అందగానే ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయుల హర్షం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అప్పగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపాధ్యాయులు స్వాగతించారు. ఈ మేరకు గజగట్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రీన్ బ్యాడ్జిలతో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలయ్య, ఉపాధ్యాయులు రమేష్, కవిత ఉన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ పాఠశాలలో రెండో విడత పాఠ్యపుస్తకాలను ఎంఈఓ బాలరాజు గురువారం పంపిణీ చేశారు. ఈ మేరకు రెండోవిడత కింద 12,395 పుస్తకాలు రావడంతో మండలంలోని వివిధ పాఠశాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు అంజయ్య, మహేందర్, మొగులయ్య, స్వప్న, సీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): గర్భిణులు, బాలింతలు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ ఆసూరి సరళ అన్నారు. గురువారం స్థానిక పూసలగల్లి 9వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాల ఆహార వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లి, ముసాపేట, జమ్లానాయక్‌తండా పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ వెంకటేశం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరుశాతాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై పీటీఎం మీటింగ్‌లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని హెచ్‌ఎం సిద్దార్థకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సంపత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దే

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి గురువారం తెలిపారు. ఈ మేరకు పెద్దశంకరంపేట, మాడ్చెట్‌పల్లి, ముసాపేట, మక్తలక్ష్మాపూర్, కోళపల్లి, దానంపల్లి, టెంకటి తదితర గ్రామాలలో రూ.60 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆయన ప్రారంభించారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్‌దేనని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, ఆర్‌ఎన్ సంతోష్, మురళిపంతులు, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, గంగారెడ్డి, రాజేందర్‌గౌడ్, పెరుమాండ్లగౌడ్, కుంట్ల రాములు, కుంట్ల శ్రీను, గోవింద్‌రావు, రోమాల సాయిలు, రాజునాయక్, సాయిరెడ్డి, విద్యుత్ ఏఈ యాసిన్‌అలీ, సిబ్బంది నరేందర్, సుదీప్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్త్ కార్డుల మంజూరుకు కృషి



మాట్లాడుతున్న జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి

రామాయంపేట (మెదక్): జర్నలిస్టులకు హెల్త్ కార్డుల కోసం కృషి చేస్తానని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాళ్ చారి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రగతి రిసార్ట్స్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల కోసం కృషి చేస్తున్న జర్నలిస్టులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. జర్నలిస్టులకు ప్రత్యేకంగా హెల్త్ కార్డుల కోసం రాష్ట్రస్థాయిలో సంఘం నాయకులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారన్నారు. జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఏ సమస్య ఎదురైనా సంఘం అండగా ఉంటుందన్నారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ సంఘం తరపున త్వరలో రామయంపేట్‌లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా బసన్నపల్లి మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పటేరి రాము, ఉపాధ్యక్షులుగా యాదగిరి, సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీనివాసగౌడ్, సహాయ కార్యదర్శిగా నరేందర్‌ను ఎన్నుకున్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కార్యదర్శి ఏసురత్నం



కౌడిపల్లిలో వీఓఏలను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు



అరెస్ట్ అయిన నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వం ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించకుండా ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఏసురత్నం విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయం ముట్టడిని జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. అయితే ముట్టడికి వెళ్లకుండా ఐకేపీ వీఓఏలను కౌడిపల్లిలో పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లలిత, కార్యదర్శి సామేల్, కోషాధికారి శశిరేఖ, లాల్య పాల్గొన్నారు.

వీఓఏల ముందస్తు అరెస్ట్

చిన్నశంకరంపేట(మెదక్): వీఓఏలకు కనీస వేతనం అందించాలనే డిమాండ్‌తో హైదారాబాద్ సర్ప్ కార్యాలయ ముట్టడికి తరలి వెళ్తున్న మండలంలోని వీఓఏలను పోలీస్‌లు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఐకేపీ వీఓఏల ముందస్తు అరెస్టు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వీఓఏలను చేగుంట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ గౌరవ వేతనం పెంచాలని, వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అరెస్టు అయిన వారిలో ఆంజనేయులు, శంకర్, నవీన్, స్వామి ఉన్నారు.

వీఓఏల హామీలు నెరవేర్చాలి

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు వీఓఏలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి గురువారం నిర్వహించ తలపెట్టిన చలో సెర్ప్ ఆఫీస్ ముట్టడి నేపథ్యంలో మండలంలోని పలువురు వీఓఏలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ..డిమాండ్‌ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలపడానికి వెళ్తుండగా పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. అరెస్ట్ అయినవారిలో ధనలక్ష్మి, సృజన, మహేశ్, ప్రియాంక, శిరీష, మాధవి, నిర్మల, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక**

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీఓ జగన్మోహన్‌సింగ్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

◆ **బీసీ సంక్షేమ మండల అధ్యక్షుడి ఎన్నిక**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గురువారం బీసీ సంక్షేమ జిల్లా గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారాం ఆధ్వర్యంలో మండల సంక్షేమ అధ్యక్షుడిగా మావురం రామచంద్రంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం యుద్ధ ప్రాతిపదికన పనిచేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్‌కు మద్దతుగా ఈనెల 18న బంద్‌కు మండలంలోని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, యూత్ అధ్యక్షుడు పోచమ్మలగణేష్, జిల్లా కోశాధికారి దామోదర్, మెదక్ కన్వీనర్ అధ్యక్షులు సిద్ధరాములు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **క్రీడాకారుడికి సన్మానం**

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థిని నర్సాపూర్ ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గౌర్రె వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ గురువారం సన్మానించారు. మండల పరిధిలోని గుండ్లపల్లికి చెందిన పెంజర్ల తరుణ్ రాష్ట్ర స్థాయి అండర్–14 వాలీబాల్ జట్టులో జిల్లా నుంచి పాల్గొననున్నారు.

◆ **నియామకం**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళకల్ గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నూతన గ్రామ అధ్యక్షుడిగా జొన్నోజి రంగాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కనిగిరి అమెందర్, ప్రధాన కార్యదర్శిగా సర్వీన్ గౌడ్, యూత్ ఉపాధ్యక్షుడిగా మైలారం భిక్షపతిలను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గోపాల్, మల్లారెడ్డి, నర్సింహ, ఆగని నర్సింహ, నర్సయ్య, దండు సత్యనారాయణ, వెంకటేశ్, కనిగిరి నర్సింహ, రామచందర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **తండా రోడ్డుకు నిధులు మంజూరు**

చేగుంట(తూప్రాన్): మండలంలోని గొల్లపల్లి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జెత్రం తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.93 కోట్లు మంజూరయ్యాయి. రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు ఎట్టకేలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చొరవతో 2 కిలోమీటర్ల బీటీ రోడ్డు మంజూరైనట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో జెత్రం తండా, కొత్త వలియా తండాల రాకపోకలకు ఇబ్బందులు తొలగనున్నాయని తండా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

◆ **నేరాలు చేస్తే కఠిన చర్యలు**

అల్లాదుర్గం(మెదక్): పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ రేణుకారెడ్డి చెప్పారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పాత నేరస్తులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకొని మంచిగా ఉండాలన్నారు. నేరాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శంకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ...**

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిందని నార్సింగి బీఆర్‌ఎస్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం నార్సింగి మండలంలోని జప్తిశివనూర్‌లో కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి, చిన్నశంకరంపేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు మైలారం బాబు, పట్లోరి రాజు, మాజీ వైస్ ఎంపీపీ సుజాత పాల్గొన్నారు.

◆ **బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం**

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. గురువారం మండలంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పనికిరాని జీఓతో నాటకం ఆడుతున్నారన్నారు. ఈ నెల 18న జరగనున్న బీసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాంలుగౌడ్, కొండల్, యాదగిరి, రవినాయక్, వెంకటేష్, సింహం, అశోక్, సంతోష్, తదితరులు ఉన్నారు.